

# నిర్ణయం

- రావినూతల సువర్ణాకన్నన్

"అమ్మా"

గదిలో మంచం మీద పడుకుని శూన్యంలోకి చూస్తున్న అరుణ కొడుకు నాలుగేళ్ళ నాని పిలుపుతో తృళ్ళిపడి వాస్తవంలోకొచ్చింది.

"అమ్మా" మళ్ళీ పిల్చాడు నాని.

వాణ్ణి దగ్గరికి తీసుకుని -

"ఏమిట్నాన్నా?" అంది తనలో పొంగుతున్న దుఃఖ సముద్రాన్ని అతి ప్రయాసగా అవతలికి నెట్టి.

"డేడీ ఇంక రారా?" దీనంగా అడిగాడు నాని.

ఆ మాటతో అంతవరకు ఆపుకున్న దుఃఖం కట్టలు తెంచుకుని పారింది. కొడుకుని గుండెలకి హత్తుకుని బావురుమంది. తల్లి ఏడవడంతో నానీ ఏడుపు మొదలుపెట్టాడు.

అలా ఇద్దరూ ఏడుస్తూండగా పక్కింటి మీనాక్షమ్మ గారొచ్చింది. వస్తూనే -

"అదిగో మళ్ళీ మొదలుపెట్టావా? ఇదిగో చూడు లలితా! అందరం ఎప్పుడో ఒకప్పుడు పోయేవాళ్ళమే. కాకపోతే కాస్త ముందు, వెనుకా అంతే" అంది అనునయంగా.

లలిత దుఃఖాన్ని బలవంతంగా అవతలికి నెట్టి -

"నాకేం చేయాలో తోచడం లేదు పిన్నిగారూ! అసలు ఇలాంటి స్థితి నాకొస్తుందని కల్లో కూడా వూహించలేదు. కానీ... ఆయన..." దుఃఖంతో ఆమెకి నోట మాట రాలేదు.

"ఇవాళున్న దుఃఖం రేపుండదు. కాలమే ఎంతటి గాయాన్నయినా మార్చగలదు. ఇదిగో వీణ్ణి చూసుకుని కాలం వెళ్ళదియ్యి" అంది మీనాక్షమ్మ చాలా తేలిగ్గా.

"అంటే మా నాన్న ఇంక తిరిగి రాడా?" ఆతృతగా అన్నాడు నాని.

"రాడు నాయనా! రాడు! పుణ్యాత్ముడు. ఏమాత్రం తీసుకోకుండా పోయాడు! ఇలాంటి చావు ఎంతమందికొస్తుంది?"

"మరైతే నన్ను ఎవరు చదివిస్తారు?" బిక్క మొహంతో అడిగాడు నాని.

"హయ్యో! ఆ రాతే నీమొహానుంటే మీ నాన్న అర్ధాంతరంగా ఎందుకు పోతాడు నాయనా! ఏదో ఒకటి చదివి మీ అమ్మని పోషించాలి" రాని కన్నీళ్లు ఒత్తుకుంటూ అంది మీనాక్షమ్మ

"మా అమ్మా?"

"అవును. ఇంట్లో వుండే, ఏ అప్పడాలో, వడియాలో చేసి అమ్ముకుని నిన్ను చదివిస్తుంది మీ అమ్మ. తర్వాత అవిణ్ణి నువ్వు పువ్వుల్లో పెట్టినట్టు చూసుకోవాలి..."

"ఛీ! మా అమ్మ అలాంటి పన్లు చెయ్యదు" గభాల్న అన్నాడు నాని.

"మరేం చేస్తుంది?" వ్యంగ్యంగా అంది మీనాక్షమ్మ గారు.

"ఏదైనా ఉద్యోగం చూసుకోవాలి!" గద్గద స్వరంతో అంది లలిత.

"ఉద్యోగమా!" కెవ్వుమన్నంత కేక పెట్టింది మీనాక్షమ్మ

"అవును. నేను ఎమ్మెస్సీ చేశాను. ప్రయత్నిస్తే ఏదో ఒకటి దొరక్కపోదు. కానీ..." క్షణం ఆగింది లలిత.

"ఇదిగో" ఇది నీకు పుట్టిన బుద్ధేనా? ఎవరైనా వచ్చి సలహా ఇచ్చారా?" తీక్షణంగా అంది మీనాక్షమ్మ

"ఎవరు చెప్పలేదు. నేనే అనుకున్నాను."

"హవ్వ! మొగుడు పోయి నెలన్నా కాలేదు. అప్పుడే బైటకెళ్ళి ఉద్యోగం చేస్తావా? చాల్చాల్లే. ఈ మాట నాతో అంటే అన్నావుగానీ ఇంకెవరితోనూ అనకు."

"కానీ ఇల్లు గడవాలిగా!"

"దానికి సలహా చెప్పానుగా. అప్పడాలూ..."

"అవన్నీ నేను చెయ్యలేను పిన్నిగారు!"

"కానీ నువ్వు బైటికెళ్ళకూడదు. కనీసం ఓ సంవత్సరం పాటయినా..." అంది మీనాక్షమ్మ చాలా తేలిగ్గా.

"అవునే లలితా. నీకెంత అయినవాళ్ళు లేకపోయినా, నువ్వు మాత్రం బైటికెళ్ళకూడదు..." అంటూ వచ్చింది ఓ పూర్వ సుమంగళి.

"విన్నావుగా... నీకంత ఇబ్బంది వుంటే మరో నాలుగు రోజులు మేమే అన్నం అదీ పంపుతాం. నువ్వు మాత్రం గడప దాటకూడదు. అది అందరికీ అరిష్టం" అంది కామాక్షమ్మ

వాళ్ళిద్దరూ కలిసి లలితకి బ్రెయిన్‌వాష్ చేసి, బైటికెళ్ళను అని ప్రమాణం చేయించుకుని మరీ వెళ్లారు.

* * * *

"అమ్మా..." బేలగా పిల్చాడు నాని ఓరోజు.

మసకబారిన కళ్ళతో చూపిందామె కొడుకుని.

"అమ్మా! నువ్వు అందరిలోకీ రాకూడదా?"

"ఊహూఁ!" వచ్చే దుఃఖాన్ని పెదవిని పళ్ళతో నొక్కి మరీ అందామె. కొడుకుతో ఎవరో ఏదో అన్నారని గ్రహించి.

"ఎందుకు?"

"అది నీకు చెప్పినా అర్థం కాదురా నాన్నా!"

"అర్థం అయేలా నేను చెప్తాను" ఖంగుమంది ఓ గొంతు. త్రుళ్ళి పడి చూశారా తల్లి కొడుకులు.

గుమ్మంలో ఒక ముప్పైయ్యేళ్ళ యువకుడు!

"నువ్వా?" అప్రయత్నంగా అంది లలిత.

"నేనే! నీ భర్త పోయాడని నువ్వు చెప్పకపోయినా నాకు తెలిసింది" గంభీరంగా అంటూ లోపలికొచ్చి కూర్చున్నాడతను.

ఆమె బాధగా చూసింది.

"అది కాదు ప్రసాద్... ఈ లోకంలో నాకు ఒకే ఒక ఆత్మీయుడున్నాడంటే అది నువ్వే...."

"ఓ! అందుకే కదూ నీ భర్త పోయి ఆర్నెల్లయినా, నువ్విన్ని పాట్లు పడుతున్నా ఒక్క ఉత్తరం ముక్కైనా రాయంది?" అతని గొంతులో వాడి, వ్యంగ్యం నిండి వున్నాయి.

ఆమె మాట్లాడలేదు.

ఆమెకేసి పరిశీలనగా చూశాడతను.

"లల్లీ!" మృదువుగా అన్నాడు.

"లలిత గుండెల్లో సప్తసంద్రాలు పొంగి కన్నీటి రూపంలో బైటికొచ్చాయి.

అతను లేచాడు. తన చేతిలోని బేగ్‌లోంచి బిస్కెట్ పాకెట్స్, బొమ్మలూ అవీ నానికిచ్చి "నువ్వెళ్ళి ఆడుకో నాన్నా" అన్నాడు.

వాడు ఆనందంగా బైటికెళ్లాడు బొమ్మల్ని మురిపెంగా చూసుకుంటూ.

కుర్చీ ఆమెకి దగ్గరగా లాక్కుని -

"ఇప్పుడు చెప్పు" అన్నాడతను.

"ఏమిటి?" కళ్ళు వాల్చేస్తూ అందామె..

"ప్రభు పోయాడని ఎవరో చెప్తే విని హతాశుణ్ణయిపోయాను. ఇక్కడ ఎంక్వయిరీ చేస్తే నీ గురించిన వివరాలన్నీ చెప్పారు... అంటే నువ్వు తయారుచేసే అప్పడాల గురించీ మీ ఇరుగు పొరుగుల అమూల్య సలహాల గురించి..."


"నేను దిక్కులేనిదాన్ని ప్రసాద్! ఆయన పోయినప్పుడు వాళ్ళాదు కోకపోతే...." రెండు చేతులలో ముఖాన్ని దాచుకుందామె.

అతనికి ఆమెపట్ల అంతులేని జాలి కలిగింది. ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని -

"లల్లీ! నువ్వు చదువుకున్నదానివి. ప్రయత్నిస్తే ఎక్కడైనా ఉద్యోగం చేస్తుంది. నా మాట విను. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నాతో రా. నీకు మంచి ఉద్యోగం చూస్తాను. అంతే కాదు నీకు జీవితాంతం తోడుగా నిలుస్తాను. నానిని నా స్వంత కొడుకనుకుంటానూ!" రవంత ఆవేశంగా అన్నాడు.

"ప్రసాద్!"

"అవును లల్లీ! నా గురించి నీకు, నీ గురించి నాకు అన్నీ తెలుసు. నిన్ను ఇప్పటికీ ఆరాధిస్తున్నాను. అందుకే ఎంతమంది ఎన్ని రకాలుగా చెప్పినా పెళ్ళి జోలికి పోలేదు. నువ్వు ఆనందంగా వున్నావు. చాలనుకున్నాను కానీ...." అతని గొంతు ఒణికింది.



ప్రతిమలా అయిపోయింది లలిత.

ఆమెకి తెలుసు కాలేజీ రోజుల్లో అతను తననెంత ప్రేమించాడో, ఆరాధించాడో. కానీ విధి మరో రకంగా ఆడించింది. అనుకోని రీతిలో ప్రభుతో తన పెళ్ళయింది.

"లల్లీ!" చనువుగా ఆమె పైట చెంగుతో ఆమె కళ్ళు ఒత్తి ఏదో చెప్పబోయాడు. అప్పుడే రంగప్రవేశం చేసింది మీనాక్షమ్మ

ఆమెని చూసిన లలిత పామును చూసినంత కంగారుపడి అతనికి దూరంగా జరిగింది.

మీనాక్షమ్మ కుర్చీలో కూర్చుంటూ -

"నువ్వెవరివి నాయనా?" అంది ఒకలాంటి వ్యంగ్యంగా.

"లలితకి ఆత్మీయుణ్ణి" గంభీరంగా అన్నాడతను.

"ఓ! అలాగా. అయితే ఈ ఆత్మీయుడు ఇన్నాళ్ళూ ఏమయ్యాట్ట?"

"ప్రభు పోయిన సంగతి నాకు తెలియదు. తెలియగానే పరిగెత్తు. కొచ్చాను."

"అంతా అయిపోయాక ఇప్పుడెందుకు రావడం!" మూతి అదోలా తిప్పింది మీనాక్షమ్మ

"అంతా ఏమవలేదు. ప్రభు పోయాడు కానీ ఆమె నూరేళ్ళ జీవితం అంతా ముందే వుంది."

"అంటే?"

"అంటే లలిత పి.జి. చేసింది. బ్రిలియంట్ స్టూడెంట్. గోల్డ్ మెడల్ కూడా సంపాయించింది. ఆమెకి ఎవరైనా కళ్ళు మూసుకుని ఇస్తారు ఉద్యోగం. అప్పుడే ఈ అప్పడాలు, వడియాలు గొడవ అక్కర్లేదు. ఎవరో సాయం చేస్తున్నట్టు నటించి ఆమెని కట్టిపడేసే పరిస్థితీ రాదు" సీరియస్‌గా అన్నాడు ప్రసాద్.

మీనాక్షమ్మ మొహం ఎర్రబడింది కోపంతో, ఆవేశంతో ఏదో అనబోయింది. కానీ లలిత కల్పించుకుని -

"మీరు బాధపడకండి పిన్నిగారూ! ప్రసాద్‌కి నామీద అభిమానం. అందుకే ఆ పరిస్థితి తెలిసి బాధపడి అలా అన్నాడు" అంది.

"అయితే ఉద్యోగం?"

"నేను ఉద్యోగం చెయ్యను. ఏడాదిదాటే దాకా గడప దాటకూడదని మీరు చెప్పారుగా? నేను మీకిచ్చిన మాట మీదే నిలబడతాను" స్థిరంగా వుంది లలిత గొంతు.

మీనాక్షమ్మ మొహం వికసించింది. ప్రసాద్ మొహం గంభీరంగా అయిపోయింది.

"అయితే నీ నిర్ణయం ఇదేనా?" అన్నాడు సూటిగా.

"అవును. నేను పెరిగిన వాతావరణం క్కూడా నాకు తెలుసుగా. నేను నానా గొడవ చేసాను కాబట్టి నాకీ మాత్రం చదువైనా చెప్పించారు. ఆడది బైటికెళ్ళి ఉద్యోగం చెయ్యడం మావాళ్ళకూ్కడా ఇష్టం వుండేది కాదు. వాళ్ళిప్పుడున్నా, పిన్నిగారిచ్చిన సలహానే ఇచ్చేవారు. కాకపోతే నన్ను తమ దగ్గరికి తీసికెళ్ళేవారేమో!"

"ఇప్పుడు నీకు దగ్గరివాళ్ళెవరూ లేరుగా?"

"నువ్వున్నావుగా!" నవ్వింది లలిత.

ఆమె కళ్ళ నిండా నీళ్ళూరాయి.

"సరే. నేనొస్తాను. ఎలాగోలా ఇతగాణ్ణి పంపెయ్యి" లలిత చెవిలో చెప్పినట్టు చెప్పి వెళ్ళిపోయింది మీనాక్షమ్మ

"నేనొస్తాను" లేచాడు ప్రసాద్.

"ప్రసాద్!"

"అవును లల్లీ! నాకిక్కడ రవంత చోటు కూడా లేదని తెలిశాక ఇక్కడుంటే అంతకన్నా సిగ్గుచేటు మరొకటుండదు."

"అది కాదు ప్రసాద్... అసలు."

"నో ఆర్గ్యుమెంట్ ప్లీజ్.... కానీ ఒక్క మాట! నీ మనసు మారితే నా ఇంటి తలుపులు నీకోసం తెరిచే వుంటాయి. సరాసరి వచ్చెయ్యి! మళ్ళీ నీ జీవితంలోని వసంతం నేను తెప్పిస్తాను" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు ప్రసాద్.

లలితకి దుఃఖం వచ్చింది.

మంచం మీద పడి బావురుమంది. కంటి నీరు ఇంకేలా ఏడ్చింది.

"అమ్మా" అంటూ కొడుకు రావడంతో గభాల్న లేచి కళ్ళు తుడుచుకుంది.

"అమ్మా! అంకుల్ వెళ్ళిపోయారా?" అన్నాడు నాని.

"ఊఁ!"

"ఆయన చాలా మంచివారు కదమ్మా!"

"ఊఁ!"

"హమ్మయ్య! వెళ్ళిపోయాడా!" అంటూ వచ్చింది మీనాక్షమ్మ.

ఆమె తమ ఇంటికేసి కన్ను వేసి వుంచిందని గ్రహించిన లలితకి మొదటిసారిగా ఆమెమీద చిరాక్కలిగింది. అయినా అదేం బైటక్కనిపించకుండా -

"వెళ్ళిపోయాడు" అంది భావరహితంగా.

మీనాక్షమ్మ మరో గంట క్లాస్ తీసుకుని వెళ్ళిపోయింది.

తర్వాత ఆమె ఎన్నో ఇక్కట్లకి గురయ్యింది.

అందంగా వుంది. వయసులో వుంది. భర్త లేడు. మరలాంటి ఆడదాని మీద మగవాడి దృష్టి పడకుండా వుంటుందా?

ఎంతో మంది అప్పడాలు, వడియాల కోసం వచ్చేవారు వెకిలి వేషాలు వేసేవారు. ద్వంద్వార్థపు మాటలు మాట్లాడేవారు. కొందరైతే బైటపడి సున్నితమైన చివాట్లు తిని ఆమె గురించి చెడుగా ప్రచారం చెయ్యసాగారు.

ఇదంతా ఆమెకి భరించలేనంత బాధగా వుంది. అయినా తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. వీధి గడప తొక్కలేదు.

బాబు స్కూల్‌కెళ్తే టీచర్లు సైతం వాణ్ణి అదోలా చూసి, ఆ పసి మనసు నొప్పించే మాటలతో వాడి పసి మనసుకి గాయం చేసి, పైశాచికానందం పొందేవారు, కామాంధుల పుకార్లే నిజాలనుకుని.

ఇదంతా ఆ పసి మనసు తట్టుకోలేకపోయింది.

"ఇవాళ అమ్మనడిగెయ్యాలి. ఎప్పుడడిగినా నాన్న దేవుడి దగ్గరున్నారు అంటుందే గానీ ఎప్పుడొస్తారని అడిగితే జవాబు చెప్పదు! అందుకే ఇవాళ అడిగెయ్యాలి?" గట్టిగా నిర్ణయించుకున్నాడు.

అలా ఆలోచిస్తూనే ఇల్లు చేరుకున్నాడు. స్కూల్ బుక్స్ ఓమూల పడేసి తల్లి దగ్గరికిచ్చాడు.

అంతకు ముందే ఓ నలుగురు పిల్లల తండ్రి వచ్చి ఆమెని తినేలా చూస్తూ, తన మనసు బైటపెట్టి తన మనిషిగా వుంటే కనకాభిషేకం చేస్తానని, ఆమె చేత చివాట్లు తిని, తిట్టుకుంటూ నిష్క్రమించాడు.

ఆ బాధ ఆమె మనసు తొక్కేస్తుంటే వచ్చాడు నాని.

"అమ్మా" అన్నాడు కాస్త గట్టిగా.

త్రుళ్ళిపడి చూసి -

"అరె! అప్పుడే వచ్చేశావ్! ఏం తాగుతావు?" అంటూ లేవబోయింది లలిత.

"నాకవేం వద్దు!"

"మరేం కావాలి?"

"నాన్న!"

"నానీ...."

"అవును! నాకు నాన్న కావాలి. నాన్న గురించి నిజం చెప్పాలి. చెప్తేనేగానీ నేను మంచినీళ్ళు కూ డా తాగను!"

విస్మయంగా చూసిందామె.

"ఇంతకీ నాన్న వస్తాడా రాడా?"

"రారు" అన్నట్టు తల అడ్డంగా ఊపిందామె.

నాని మొహం దీనంగా అయిపోయింది.

"అసలు నాన్న ఎక్కడికెళ్ళారు? నాన్నని వాళ్ళంతా కలిసి ఎక్కడికి తీసుకెళ్ళారు!" తండ్రి మరణపు సీన్ గుర్తొచ్చిన నాని అడిగాడు.

"నానీ!" మరోసారి కొడుకుని పట్టుకుని బావురుమంది లలిత. వాడూ ఏడుపు మొదలుపెట్టాడు.

* * * *

కాలం ఎవరికోసం ఆగదు. అయినా ఎన్నో ఇక్కట్లు పడుతూనే ఇరుగు పొరుగు అమ్మలక్కల సలహా ప్రకారం అప్పడాలూ అవీ చేసి అమ్మి ఎలాగో బతుకు ఈడ్చుకొస్తోంది.

ఓరోజు మీనాక్షమ్మ కొడుకు అప్పడాలు కావాలని వచ్చాడు. అతన్ని కూర్చోపెట్టి లోపలికెళ్ళింది లలిత అప్పడాలు తేవడానికి.

అంతే అతను కీచకుడే అయ్యాడు. తనకి లొంగిపోతే ఎన్నో విధాలుగా సాయం చేస్తానన్నాడు. ఈ రహస్యం పెదవి దాటనియ్యనని ప్రమాణం చేశాడు.

అతని వాలకం ఇటీవల ఆమె గమనిస్తూనే వుంది. అయినా పెద్దగా పట్టించుకోలేదు. కారణం తను ఈ మాత్రమైనా బతుకునీడ్చుకొస్తోందంటే ఆ మీనాక్షమ్మ లాంటివాళ్ళవల్లే.

కానీ ఈరోజు మాత్రం ఆమె కాళికాదేవే అయింది. అయినా ఎన్నో విధాలుగా చెప్పి చూసింది. కానీ కామాంధుడైన అతని చెవికెక్కలేదామె మాటలు. ఆమెను బలవంతంగా పొందాలని చూసి చావుదెబ్బలు తిని, కుంటుకుంటూ బైటికెళ్ళిపోయాడు.

మరో రెండు నిమిషాలకి మీనాక్షమ్మ వచ్చింది. లలితలో ఇంకా ఆవేశపు ఛాయలు కనిపిస్తూనే వున్నాయి.

"లలితా! ఏమిటలా వున్నావ్?" ఆప్యాయత నటిస్తూ అంది మీనాక్షమ్మ.

"రేపు రండి చెప్తాను" గంభీరంగా అంది లలిత. మీనాక్షమ్మ తేలిగ్గా నవ్వేస్తూ -

"మావాడేదో అన్నాడని బాధపడుతున్నావా! ప్చ్! వాడి భార్య రోగిష్టిది. నువ్వు భర్త లేనిదానివి... అందుకే...."

ఆమె మాట పూర్తి కాకుండానే -



## వయసుతో పని ఏముంది?

భర్త వయసు 78. భార్య వయసు 22. వాళ్లిద్దరి వయసులో తేడా 55 సంవత్సరాలు. అమెరికాలో - న్యూజెర్సీలో కాపురం చేస్తున్నారీ దంపతులు. 1978లో వివాహం చేసుకున్నారు. భర్త పేరు జేమ్స్, భార్య పేరు పేట్. పేట్ తన ఇరవై రెండవ ఏట డెబ్భై ఏళ్ల జేమ్స్‌ని పెళ్లి చేసుకోవడమే గాక, వివాహమైన నాలుగేళ్లకి జేసన్ అనే కొడుకుని కూడా కన్నది. భార్యా భర్తల మధ్యగల వయసు తేడామీద ఒక అమెరికన్ వార పత్రిక నిర్వహించిన పోటీలో గెలుపొందడం ద్వారా వీరి దాంపత్య జీవితం గురించి ప్రపంచానికి తెలిసింది.

\- డి. పద్మజ

# ఏజెన్సీ ప్రాంతాల్లో పౌష్టికాహార పునరావాస కేంద్రం



మనదేశంలో శిశు మరణాల్లో అధిక శాతం పౌష్టికాహార లోపం వలననే ఏర్పడుతోంది అన్నది అందరికీ తెలిసిన విషయం. పౌష్టికాహార లోపం వలన తీవ్ర అనారోగ్యానికి గురై వ్యాధి నిరోధక శక్తి కోల్పోవటం వల్ల ఏర్పడే మరణాల సంఖ్య నానాటికీ పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు.

ఇలా తీవ్ర పోషకాహార లోపంతో బాధపడే 6 సం॥ల లోపు పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు అనుబంధ పోషకాహారం ఉచితంగా ఇస్తూ వైద్య సహాయం అందిస్తూ స్థానికంగా లభించే ఆహార పదార్థాలలో పౌష్టికాహారాన్ని చాటి చెప్పేందుకుగాను పశ్చిమ గోదావరి జిల్లాలో కొయ్యల గూడెం గ్రామంలో పౌష్టికాహార పునరావాస కేంద్రాన్ని సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా ఏర్పాటు చేసారు. దీన్ని కొయ్యల గూడెం ప్రాథమిక అరోగ్య కేంద్రానికి అనుసంధానింప బడి నిర్వహిస్తున్నారు.

దీనిలో స్థానికంగా లభించే ఆహార పదార్థాలలో తక్కువ ఖర్చులో సులభతరమైన బలవర్ధకమైన అహారాన్ని తయారు చేయడం నేర్పుతారు. అలాగే పౌష్టికాహార లోప నివారణకు శిక్షణ ఇస్తారు.

పౌష్టికాహార లోపం గల పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారం ఇవ్వటం గురించి తల్లులకు ప్రయోగాత్మకంగా తయారుచేసి చూపడం, పిల్లల పోషణ విషయంలోఅవలంబించవలసిన పద్ధతుల గురించి ఈ కేంద్రంలో వివరిస్తారు.

ఈ కేంద్రంలో 3 సం॥ల లోపు పిల్లలను, గర్భిణి స్త్రీలను, పసి పిల్లల తల్లులను చేర్చుకుంటారు. ఇందులో ఒకటి అత్యవసరివార్డు, రెండవది న్యూ ట్రీషన్ వార్డుగా విభజించి న్యూట్రిషన్ వార్డులో వైద్య సమస్యలు లేని అతి పోషణ లోపం గలవారిని చేర్చుకుంటారు.

రిస్కులో వున్న పిల్లల తల్లులు లేదా అటెండెంట్లు కూడా వారి పిల్లల సేవల నిమిత్తం పునరావాస కేంద్రాలలో వుండడానికి అనుమతిస్తూ వారికి ఉచిత భోజన వసతి మందుల సరఫరా, ప్రయాణపు ఖర్చుల చెల్లింపు వసతులు ఈ కేంద్రంలో ఏర్పాటుచేసారు. ఈ కేంద్రంలో తల్లులు, అటెండెంట్లు న్యూట్రిషను డిమాన్‌స్ట్రేటర్‌లు వారి సహాయకుల ద్వారా పిల్లలకు స్థానికంగాదొరికేఆహార పదార్థాలు పౌష్టికాహార తయారీలో శిక్షణతో పాటు ఉచిత విద్యా బోధన కూడా చేస్తారు.

ఇందులో వైద్య శాఖ సిబ్బంది, అంగన్ వాడి కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు ఎంపిక చేసిన ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజన, గిరిజనేతర పిల్లలను, తల్లులను చేర్చుకుంటారు.

-ఎల్. వెంకటరత్నం

నరసాపురం

---

"ప్లీజ్ ఇప్పటికి మీరెళ్ళండి. రేపు మాట్లాడదాం" దుఃఖావేశాన్ని దాచుకుంటూ అంది.

లలిత మొహం చూసి వెళ్ళిపోయిందామె.

మర్నాడు ఉదయం బైటికొచ్చింది లలిత. అందరూ చూడరానిదేదో చూసినట్టు చూశారామెని. ఆమె సుమంగళిలా వుంది. తనని చూస్తున్న వారితో -

"ఏమిటలా చూస్తున్నారు. బైటికే రాకూడని లలిత ఏకంగా బొట్టు, పూలు, గాజులతో ధైర్యంగా వచ్చిందేవిటా అనా? నిజమే నేనిన్నాళ్ళూ మీ అందరి సలహాలనీ పాటిస్తూ నీతేదో, నియమాలేమిటో గ్రహించలేక పోయాను. కానీ ఓ దుర్మార్గుడు నన్ను బలాత్కరిస్తుంటే, అతగాడి తల్లి, ఇందులో తప్పేం లేదని, గుట్టుగా ఏం చేసినా ఫర్వలేదని సలహా ఇచ్చింది. అప్పుడు తెలిసింది నేనెంత గుడ్డిగా మిమ్మల్ని నమ్మానో?" క్షణం ఆగింది లలిత.

"ఇప్పుడు ఇలా తయారైన నువ్వు, మావాడు ఏదో అంటే పెద్ద పతివ్రత పోజు పెట్టావేం?" కసిగా అంది మీనాక్షమ్మ

లలిత నవ్వింది.

"నేనెప్పుడూ పతివ్రతనే. చాటుమాటు వ్యవహారాలు చేస్తూ పైకి పాతివ్రత్యం నటించే చాలా మంది కన్నా నేను నయం. వాళ్ళతో పోలిస్తే నేను పతివ్రతనే. అన్నట్టు మీకు విషయం చెప్పలేదు కదూ" అని పక్కనున్న కొడుకుతో -

"నాన్నా! డేడీని తీసుకురా!" అంది.

బిత్తరపోయారంతా.

మరు నిముషం ప్రసాద్ చెయ్యి పట్టుకుని వచ్చి -

"ఇదిగో ఈయనే మా నాన్న" ఉత్సాహంగా అన్నాడు నాని.

"అవును. నేనూ, ఈయన గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం. నాకు చల్లని నీడ దొరికింది. ఈ పాముల మధ్య జీవించలేనని నేనీ నిర్ణయానికొచ్చాను. రేపు మేం ఇక్కణ్ణించి వెళ్ళిపోతున్నాం. ఇంక మీరు అరచి చచ్చినా, చెవులు కొరుక్కున్నానాకేం భయం లేదు. వెళ్ళండి. నా మంచి చెడ్డలు చూస్తున్నట్లు నటిస్తూ, నా వెనుక గోతులు తవ్వుతూ ఓ వేశ్యామాతల్లా ప్రవర్తించిన మీ అందరికీ నా నమస్కారాలు. ఇంక నా జోలికి రాకండి" రెండు చేతులూ జోడించి, ప్రతిమల్లా నిల్చుండిపోయిన వాళ్ళనలా వదిలేసి ఓ చేత్తో నానిని, మరో చేత్తో ప్రసాద్‌ని పట్టుకుని హుందాగా లోపలికెళ్ళిపోయింది లలిత.

అమ్మలక్కలంతా శిలల్లా వుండగానే ధడాల్న తలుపులు వేసుకుంది.

ఆ శబ్దానికి ఉలిక్కిపడి వాస్తవంలోకొచ్చిన అమ్మలక్కలు ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ నోట మాట రాక అక్కణ్ణించి కదిలారు.

కిటికీలోంచి ఇదంతా గమనించిన లలితా ప్రసాద్ పగలబడి నవ్వుకున్నారు.

చాలా రోజుల తర్వాత తల్లి నవ్వడం చూసిన నాని కూడా హాయిగా నవ్వాడు.